INTERNATIONAL JOURNAL OF NOVEL RESEARCH AND DEVELOPMENT (IJNRD)
© 2026 IJNRD | Volume 11, Issue 5, May 2026 | ISSN: 2456-4184 | IJNRD.ORG

# దాశరథి 'మహాబోధి' బౌద్ధ తత్వం

*డా. పొనుగోటి రవికుమార్,*
*అసోసియేట్ ప్రొఫెసర్,*
*తెలుగు విభాగాధిపతి,*
*యస్.ఆర్ & బి.జి.యన్.ఆర్.*
*ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (A++),*
*ఖమ్మం.*

## పరిచయం

దాశరథి కృష్ణమాచార్యులు, తెలంగాణ సాయుధ పోరాటంలో తన కవిత్వంతో ప్రజలను ఉత్తేజపరిచిన మహాకవి. ఆయన రచనలు సామాజికన్యాయం, మానవవిముక్తి పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. 'మహాబోధి'కావ్యం బౌద్ధతత్వశాస్త్ర లోతైన సూత్రాలైన దుఃఖం, తృష్ణ, అహింస, కరుణ, నిర్వాణం వంటి భావనలను తనదైన శైలిలో ఆవిష్కరించారు. ఈ వ్యాసం, 'మహాబోధి' కావ్యంలోని పద్యాలను, జాతక కథల సారాంశాలను ఆధారంగా చేసుకొని, దాశరథి బౌద్ధతత్వాన్ని ఎలా విశ్లేషించారో, సమకాలీన సామాజిక సమస్యలకు ఎలా అన్వయించారో విశ్లేషిస్తుంది.

## దాశరథి 'మహాబోధి' కావ్యంలో బౌద్ధతత్వం

దాశరథి కృష్ణమాచార్యులు తన 'మహాబోధి' కావ్యంలో బుద్ధుని బోధనలను, ఆయన జీవిత సారాంశాన్ని, బౌద్ధమతం యొక్క ప్రధాన సూత్రాలను అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ పద్యాలు కేవలం బుద్ధుడ్ని స్తుతించడమే కాకుండా, మానవజాతి ఎదుర్కొంటున్న సమస్యలకు బౌద్ధతత్వంలో పరిష్కారాలను సూచిస్తాయి.

**బుద్ధ తేజం - మానవ విస్మృతి**: కావ్యం ప్రారంభంలోనే దాశరథి బుద్ధుని తేజస్సును, ఆయన బోధనల ప్రాముఖ్యతను...

"ప్రాక్ ప్రపంచమందు వ్యాపించి వెలిగిన
బుద్ధ తేజ మెచట పుట్టు గనెనో అట్టి
భరతభూమియందు మానవ కోటిః
బుద్ధమూర్తి మరిచిపోవ దగునే?"" (మహాబోధి,పేజి.1)

బుద్ధుని స్మరించు వారల బుద్ధికి
వృద్ధత్వ మంటబోవదు యువతా;
సిద్ధికి మహానుభావుడు సిద్ధార్థుని
గూర్చి కొంత చింత జరుపిడీ" (మహాబోధి,పేజి.1)

ఈ కావ్యంలో బుద్ధుడు భారతదేశంలో జన్మించి, ఆయన జ్ఞానోదయం ప్రపంచమంతటా వ్యాపించిందని నొక్కి చెబుతాయి. అటువంటి మహనీయుడిని భారత ప్రజలు మర్చిపోవడం తగదని కవి ప్రశ్నిస్తారు. బుద్ధుని స్మరించడం ద్వారా బుద్ధికి వృద్ధాప్యం రాదని, యువత సిద్ధిని పొందాలంటే సిద్ధార్థుని గురించి ఆలోచించాలని పిలుపునిస్తారు. ఇది బౌద్ధ తత్వంలో జ్ఞానం ప్రాముఖ్యతను, బుద్ధుని బోధనలను అనుసరించడం ద్వారా లభించే మానసిక స్పష్టతను సూచిస్తుంది.

**అహింస - సర్వజీవ కారుణ్యం**: ఈ కావ్యంలో బుద్ధుని అహింసా సిద్ధాంతం, సర్వజీవ కారుణ్యం పద్యాలలో ప్రముఖంగా కనిపిస్తాయి

''హింస్రకత పెచ్చు పెరిగిన ఈ జగాన
ప్రభవమైన అహింసన వ్రతులలోన

ప్రాగ్ర సరుడయి సిద్ధార్థరాజు తాను
బుద్ధుడైనాడు సర్వజీవులను గావ" (మహాబోధి, పేజి.1)

"నరులయందే గాక నానా విధములైన
జంతుతతురయందు జననమంది
సకల భూతకోటి సాహాయ్యమునకయి
బ్రతుకు నంకితమ్ము పరచినాడు" (మహాబోధి, పేజి.2)

"జంతు హింసలహింసలతోడ
స్వర్గసాధన సేయ జూచువారల తప్పు చూపినాడు" (మహాబోధి, పేజి.3)

"ఈ ప్రపంచంబునం ఎన్నడేని గాని
ద్వేషమును ద్వేషమున నిరోధింపలేము" (మహాబోధి, పేజి.22)

ఈ కావ్యంలో హింస పెరిగిపోయిన లోకంలో సిద్ధార్థుడు అహింసా వ్రతులలో అగ్రగామిగా నిలిచి, సర్వజీవులను రక్షించడానికి బుద్ధుడయ్యాడని స్పష్టం. కేవలం మానవులకే కాకుండా, సమస్త జంతుజాలం పట్ల కూడా ఆయన కరుణను ప్రదర్శించి, తన జీవితాన్ని సకల భూతకోటి సహాయానికి అంకితం చేశారని కవి వివరిస్తారు. జంతుహింస ద్వారా స్వర్గాన్ని సాధించాలనుకునే వారి తప్పును బుద్ధుడు చూపించాడని, ద్వేషాన్ని ద్వేషంతో నిరోధించలేమని బౌద్ధ అహింసా సూత్రాన్ని నొక్కి చెబుతారు.

**అజ్ఞానం నుండి జ్ఞానోదయం వైపు**: అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పొందడం ద్వారా దుఃఖం నుండి విముక్తి పొందవచ్చని బౌద్ధ తత్వం బోధిస్తుంది. ఈ భావన దాశరథి పద్యాలలో ప్రతిధ్వనిస్తుంది.

"అజ్ఞాన పశుచ్ఛేదన
యజ్ఞమ్మున గాక లోకుల న్యాపాయా
భిజ్ఞత గడతేరుదురే!
విజ్ఞుడు బుద్ధుండు వాని వినుడు శుభంబౌ (మహాబోధి, పేజి.2)

భ్రమ తొలగుటయే నిర్వాణము;
సంసారాంధు వందునం గల దుఃఖాంధ్యము
తెలిసి జనన మృతి దుర్గమచక్రము దాటి
రండు ప్రమదం బొదవున్" (మహాబోధి, పేజి.22)

అజ్ఞానాన్ని పశువులను బలిచ్చే యజ్ఞంతో పోల్చి, దానిని ఛేదించడం ద్వారానే లోకులు జ్ఞానాన్ని పొందగలరని కవి అంటారు. బుద్ధుని మాటలు వినడం శుభకరమని సూచిస్తారు. భ్రమలు తొలగిపోవడమే నిర్వాణమని, సంసారంలోని దుఃఖాన్ని తెలుసుకొని జనన మరణ చక్రం నుండి బయటపడటం ద్వారా ఆనందం లభిస్తుందని బౌద్ధ నిర్వాణ భావనను వివరిస్తారు.

**రాజ్యత్యాగం- దుఃఖ నివారణ** : బుద్ధుడు రాజ్యభోగాలనుత్యజించి, మానవజాతి దుఃఖాన్ని నివారించడానికి చేసిన త్యాగం దాశరథికి స్ఫూర్తినిచ్చింది.

"రాజ్య నిర్వహణ భారమునందు గల కీర్తి
తనకు వద్దని కాలదన్ని వైచి
చిరకాలమున నుండి నరుల పీడించెడి
దుఃఖ పిశాచమ్ము ద్రుంచివేయ
సకలము సృజించి కానన సరణి బోయి
దివ్య తేజోగ వేషణార్థియి, అన్న వస్త్రములు

INTERNATIONAL JOURNAL OF NOVEL RESEARCH AND DEVELOPMENT (IJNRD)
© 2026 IJNRD | Volume 11, Issue 5, May 2026 | ISSN: 2456-4184 | IJNRD.ORG

వీడి క్లేశముబడసినాడు
విశ్వకల్యాణమే గదా ప్రియము తనకు! (మహాబోధి, పేజీ. 04)

"నెత్తిపై భారమున్న వానికి విషాద,
మది తొలగిపోయినప్పుడు సౌఖ్యమ్ము కలుగు;
ఒక్క పర్యాయ మా భార మూడ్చివేయ
మరల దానిని వహింప మనస్సు పోదు"

బుద్ధుడు రాజ్య కీర్తిని త్యజించి, మానవులను పీడిస్తున్న దుఃఖ పిశాచాన్ని నాశనం చేయడానికి పూనుకున్నాడని కవి వివరిస్తారు. సర్వస్వం విడిచి, అడవులకు వెళ్లి, దివ్య తేజస్సును అన్వేషిస్తూ, అన్నవస్త్రాలు కూడా లేకుండా కష్టాలను అనుభవించాడని, విశ్వకల్యాణమే ఆయనకు ప్రియమని చెబుతారు. నెత్తిపై ఉన్న భారం తొలగిపోయినప్పుడు సౌఖ్యం కలుగుతుందని, ఆ దుఃఖం ఒకసారి తొలగిపోతే మళ్ళీ దానిని మోయడానికి మనస్సు కోరదని బౌద్ధ దుఃఖ నివారణ సూత్రాన్ని స్పష్టం చేస్తారు.

**బుద్ధునిగుణాలు-మార్గం**: బుద్ధుని గుణగణాలు, ఆయన బోధించిన మార్గం మహాబోధి కావ్యంలో స్పష్టంగా తెలియజేసారు.

"దయకు సాగరమ్ము ధర్మమునకు
గని సత్యమునకు తావు శాంతమునకు
పుట్టినిల్లు సత్త్వమున కాలవాలమ్ము
జ్ఞానమునకు తాన కాణయాచి" (మహాబోధి, పేజీ.03)

"వ్రజు వచనుం గవలు తోప వనితలెల్ల
అతను నవ్వింప కవ్వింప నాటగూర్ప యత్న
మొనరించి యోటమినందినారు
అతడాలోచనామగ్ను డౌటవలన" (మహాబోధి, పేజీ.12)

ముసలివానిని రోగిని మున్ను చూచి
యున్న కతమున మనసులో నున్న బాధ
మిక్కుటమ్మయి నెలవేయ స్రుక్కిపోయి
యే మొ యాలోచనము సేయు నిచట ప్రభువు (మహాబోధి, పేజీ.12)

"వంచింప జూచెడి వారి చూచి పక్కుమని
నవ్వే స్వామి కోపమ్ము మాని" (మహాబోధి, పేజీ.19)

"గజగజ వణకెను మదనుడు..." (మహాబోధి, పేజీ.19)

"శివుడు కోపింప దేహాన చిచ్చుబడెను
బుద్ధుడు హసింప నాత్మయే బుగ్గియెయ్యె
తాను కాలిపోయియు విజేతయయినాడు
నాడు,నేడు కాలకయును ఓడినాడు" (మహాబోధి, పేజీ.20)

"...శాంతి జయకరమ్ము క్రాంతి కన్న" (మహాబోధి, పేజీ.20)

బుద్ధుడు దయకు సాగరం, ధర్మానికి గని, సత్యానికి నిలయం, శాంతికి పుట్టినిల్లు, సత్వానికి ఆలవాలం, జ్ఞానానికి ఆధారమని కవి వర్ణిస్తారు. స్త్రీలు ఆయనను నవ్వించడానికి ప్రయత్నించినా, ఆయన లోతైన ఆలోచనలో మునిగి ఉండటం వల్ల ఓడిపోయారని చెబుతారు. ముసలివాడిని, రోగిని చూసినప్పుడు ఆయన మనసులో కలిగిన బాధ,

ఆయన జ్ఞానోదయం వైపు పయనించడానికి కారణమైందని సూచిస్తారు. మోసం చేయాలనుకునే వారిని చూసి కూడా బుద్ధుడు కోపం లేకుండా నవ్వాడని, మదనుడు ఆయన ముందు వణికిపోయాడని, శివుని కోపం మదనుడి దేహాన్ని కాల్చివేస్తే, బుద్ధుని నవ్వు ఆత్మను బూడిద చేసిందని, శివుడు కాలిపోయి గెలిస్తే, బుద్ధుడు కాలకుండానే గెలిచాడని వివరిస్తారు. ఇది బుద్ధుని అహింస, శాంతి, ఇంద్రియ నిగ్రహం, కోరికలపై విజయాన్ని సూచిస్తుంది. "శాంతి జయకరమ్ము క్రాంతి కన్న" అనే వాక్యం బౌద్ధమతం యొక్క శాంతియుత మార్గానికి గల ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

**తృష్ణ - నివారణ**: బౌద్ధతత్వంలో దుఃఖానికి మూలకారణం కోరిక. దాని నివారణ గురించి దాశరథి స్పష్టంగా పేర్కొంటారు.

''దుఃఖమునకు తృష్ణ తొలికారణం బౌను
దాని చంపివేయ బూన వలయు:
మంచి వాడ వగుము మంచి
గావింపుము అంతకన్న మించినట్టి దేది?"
తృష్ణాగ్ని జిహ్వాకాగ్ర మహోష్ణత
భరియుంపరాకయుండును; తృష్ణా
జిష్ణుడవుక మ్మ హింసా నిష్ణాతతనంది
శాంతినిం బడయవలెన్ (మహాబోధి, పేజి.22)

"ఆశాలత తెగిపడె నా
క్రోశింపను కామితముల గూరిచి; సికతా
దేశమున నింకె వాహిని,
క్లేశమ్మంతమయి పోయే లెమ్మిక నాకున్" (మహాబోధి, పేజి.23)

దుఃఖానికి తృష్ణయే తొలి కారణం. దానిని చంపివేయాలని కవి బోధిస్తారు. మంచివాడిగా ఉండాలి. మంచి చేయాలని, అంతకంటే మించింది లేదని సూచిస్తారు. కోరిక అనేది అగ్ని. అది నాలుకకొనపై భరించలేని వేడిని కలిగిస్తుంది. తృష్ణను జయించి, అహింసలో నిష్ణాతులై శాంతిని పొందాలని పిలుపునిస్తారు. ఆశ అనే లత తెగిపడితే కోరికల గురించి ఏడవాల్సిన పనిలేదని, ఎడారిలో నది ఇంకిపోయినట్లుగా దుఃఖం అంతమైపోతుంది. ఇది తృష్ణ నివారణతో పొద్దే నిర్వాణస్థితిని సూచిస్తుంది.

**సమతావాదం-విశ్వశాంతి**: బౌద్ధమతం సమతావాద దృక్పథం. విశ్వశాంతి దాని ఆదర్శం. ఈ బౌద్ధమత సూత్రాలే దాశరథి మహాబోధి కావ్యంలో ప్రతిబింబిస్తాయి.

"భిన్నవర్ణాల నాలుగు పిట్టలెగసి
నాల్గు దిక్కుల నుండి తొందరగా వచ్చి
స్వామి పాదాలపై వ్రాలి సాగి మ్రొగ్గి
తెల్లబడిపోయె తమ రంగులెల్ల డుల్ల"
"బ్రాహ్మణాది చతుర్వర్ణభవులు ప్రజలు
భేదభావమ్ము లన్నియు విడచివైచి దివ్య
నిర్వాణ పదము నందికొను కొఱకు వత్తురు
తథాగతుని చేరువకు ననంగ" (మహాబోధి, పేజి.16)

"ఇది నిర్వాణ పదమ్ము దీనిపయి మీ
రెవ్వారూ గానిండు మీ
పదములు మోపుడు, వర్ణ వర్గ కుల
సంపత్తేదియును దారి న

డ్డదు దుఃఖాస్పదమైన ఈ భవము
భ్రష్టంబౌటకున్ మున్నె అం
బుదమ ట్లార్తుల సేద దీర్పుము
రుజాభుగ్న ప్రపంచంబునన్"                (మహాబోధి,పేజీ.24)

వివిధ వర్ణాల ప్రజలు బుద్ధుని పాదాల వద్దకు వచ్చి తమ భేదభావాలను విడిచిపెట్టి, నిర్వాణాన్ని పొందడానికి తథాగతుని చేరువకు వస్తారని కవి వర్ణిస్తారు. నిర్వాణ మార్గంలో వర్ణం, వర్గం, కులం, సంపద వంటివి అడ్డురావని, దుఃఖంతో నిండిన ఈ ప్రపంచంలో మేఘం వలె ఆర్తులను సేద తీర్చారని పిలుపునిస్తారు. ఇది బౌద్ధమతం సమతావాద దృక్పథాన్ని, సామాజిక భేదాలను తిరస్కరించడాన్ని మరియు సార్వత్రిక కరుణను నొక్కి చెబుతుంది.

**చారిత్రక వారసత్వం- కళాత్మక వ్యక్తీకరణ**: తెలుగుప్రాంతంలో బౌద్ధమత సుసంపన్నమైన చరిత్ర, కళాత్మక వారసత్వం మహాబోధి పద్యాలలో ప్రస్తావించబడ్డాయి.

"అతని కనంతరీయులైనట్టి అశోక కనిష్కరాజ
సంతతి యొనరించి నట్టి బహుధా వరణీయ
క్రియా కలాపముల్ సతతము భారత ప్రజల
చారితమున్ కనకాక్షరాళి సంచిత మొనరించె,
వారల విశిష్టపథమ్మను వర్త నీయమౌ                (మహాబోధి,పేజీ.03)

తెలుగువారు బుద్ధదేవు బోధామృత
మ్మానినట్టి వార లనుట నిజం;
కాకయున్న కాంచగలమె
శ్రీ పర్వత ప్రాంత శిల్పములను బుద్ధగాథ                (మహాబోధి,పేజీ.05)

కృష్ణవేణి తల్లి కుడి క్రేవ పలనాట
వెలయు శ్రీగిరీంద్ర శిలలలోన ఆంధ్ర బౌద్ధశిల్ప
లాటలాడించిన ఉలుల మ్రోత కుల్ల మోలలాడు                (మహాబోధి,పేజీ.6)

నాగార్జునాచార్యుడాగమంతాధ్యాయి వెలసిన
సౌవర్ణ పీఠభూమి ఇక్ష్వాకురాజుల యేల్బడిలో
చేరి సాగైనా పైరుపచ్చలతలంబు సింహళా
ద్యఖిలదేశీయ బిక్షగాణమ్ము లావసించిన
విశాలా వసథము ఆంధ్ర శిల్పుల నాణ్యమైన చె
క్కడముల కాంతులు చిమ్ము విఖ్యాతసీమ"
ప్రతి తెలుగువాడు గర్వించ వలసినట్టి
దివ్యదేశమ్ము; బుద్ధమూర్తికి ప్రియమ్ము,
తమ్ముడా! రమ్ము చూసి వత్తము పవిత్ర
నాగశైలాది రాజ పుణ్యస్థలమ్ము                (మహాబోధి,పేజీ.7)

నాగరికలు తెల్గునాటి వారలు నేడు
శ్రీ గిరీంద్రమున వసంపబోరు!
వెనకబడిన వారి పేరా వర్తించెడి
చెంచువారలే వసింతు రందు                (మహాబోధి,పేజీ.8)

స్థాణువైన నాగశైలమ్ము పంచల
రేయుబవలు పరుగుతీయు కృష్ణ;
ఒకటి నిల్చి యుండు నొకటి నిల్కడ

లేని దయ్యు భుజము భుజము నంటి విడవు (మహాబోధి, పేజి. 9)

అతని సహచర్యము సేయుచుండిన
కృష్ణమ్మ ఊహించలేదనకుము నిశ్శబ్దముగ
బుద్ధుని బోలి కూర్చున్న అతని ఆలోచనల
లాకకళించి తన భాషలో పవళ్లును రేలు
పాడుచు ఆమె వీచీ పల్లకీ మృదంగ
నాదమేళనమున చెప్పగా దొడిగెను
బౌద్ధమత రహస్యం; బోధపడదు
మనకు దాని తెలియుటకై కొంత
సానుభూతి కావలయులేమ్ము పూర్వలోకమ్ము గూర్చి! (మహాబోధి, పేజి.9)

అది సహస్రాబ్దమ్ము లైన కంపింపదు
ఇదియు వేలేండ్లకు నింకిపోదు (మహాబోధి, పేజి.10)

బుద్ధధాతువు తమ గర్భమున ధరించి
కూరుచుండిన చైత్యాల కుడ్యభూమి
బుద్ధ జీవితగాథలు పొందుపరిచి
ఆంధ్రశిల్పి విశిష్టతనందినాడు

శిలందున్ తా కుశాగ్రీయ బుద్ధిని
చొప్పించి పవిత్ర బుద్ధకథ చిత్రించెన్ మహాశిల్పి;
వానిని ఆదర్శంగా గ్రహించి
తెలుగింటిన్ చక్కగా దిద్దుమా! (మహాబోధి, పేజి.11)

అశోకుడు మరియు కనిష్కుడు వంటి రాజులు బుద్ధుని బోధనలచే ప్రభావితులై చేసిన మంచి పనులు ఈ దేశ చరిత్రను సుసంపన్నం చేశాయి. తెలుగువారు బుద్ధుని బోధనామృతాన్ని స్వీకరించారని, శ్రీశైల ప్రాంతంలోని శిల్పాలు బుద్ధగాథలను తెలియజేస్తాయని, కృష్ణానదితీర పల్నాడుప్రాంతంలో ఆంధ్ర బౌద్ధశిల్పులు చెక్కిన శిల్పాలు, నాగార్జునాచార్యుడు వెలసిన నాగార్జునకొండ (విజయపురి ఇక్ష్వాకుల రాజధాని) బౌద్ధ విద్యా కేంద్రంగా విలసిల్లిందని, సింహళం(శ్రీలంక) వంటి దేశాల నుండి కూడా భిక్షువులు ఇక్కడకు వచ్చేవారని వివరిస్తారు.

ప్రతి తెలుగువాడు మన దివ్యదేశం పట్ల గర్వపడాలని, నాగశైలం (నాగార్జునకొండ) వంటి పుణ్యస్థలాలను సందర్శించాలని పిలుపునిస్తారు. నాగశైలం వద్ద నిశ్చలంగా ఉన్న కొండ, నిరంతరం ప్రవహించే కృష్ణానది, స్థిరత్వం మరియు అనిత్యత యొక్క బౌద్ధ భావనలను సూచిస్తాయి. కృష్ణానది బుద్ధుని ఆలోచనలను తన భాషలో పాడుతూ బౌద్ధమత రహస్యాలను వెల్లడిస్తుందని, అది వేల సంవత్సరాలు కంపింపదని, ఇంకిపోదంటారు. బుద్ధుని ధాతువులను తమ గర్భంలో ధరించిన చైత్యాల కుడ్యాలపై ఆంధ్రశిల్పులు బుద్ధుని జీవితగాథలను చిత్రించి విశిష్టతను పొందారని, ఆ మహాశిల్పిని ఆదర్శంగా తీసుకొని తెలుగువారు తమ ఇంటిని చక్కగా దిద్దుకోవాలని పిలుపునిస్తారు. తెలుగుప్రాంతంలో బౌద్ధమత ప్రభావం, కళాత్మక వ్యక్తీకరణ, దాని శాశ్వత వారసత్వాన్ని మహాబోధి కావ్యం తెలియజేస్తుంది.

**జాతక కథలు - బౌద్ధ సూత్రాలు**:

జాతకకథలు బుద్ధుని పూర్వజన్మల జానపదకథల సమాహారం. ఈ కథలు సాధారణ మానవుడు పాటించవలసిన నీతి, నిజాయితీలు, త్యాగం, ధర్మాల లక్షణాలను వివరిస్తూ చక్కటి సందేశాన్ని అందిస్తాయి. దాశరథి తన కావ్యంలో మహాపద్మజాతకం, ఛంపేయజాతకం మరియు ఛదంతజాతకాలను ప్రస్తావించడం ద్వారా బౌద్ధతత్వంలోని కొన్ని కీలక సూత్రాలను దృష్టాంతీకరించారు. సమయాభావం వల్ల ఛంపేయజాతకాన్ని ఈ వ్యాసంలో వివరించడం లేదు.

**మహాపద్మ జాతకం**:

మహాపద్మ జాతక సారాంశం బుద్ధుని పూర్వ జన్మలలో ఒకటైన పద్మకుమారుని కథను వివరిస్తుంది. అశోకుని కుమారుడు కునలుని కథ అని, తెలుగు ప్రాంతంలో సారంగధరుని కథగా ప్రచారంలో ఉంది. కానీ జాతకకథలలో వారణాసి రాజు బ్రహ్మదత్తుని కుమారుడు పద్మకుమారుడు. తల్లి మరణానంతరం, తండ్రి మరొక స్త్రీని వివాహం చేసుకుంటాడు. ఒకసారి రాజు యుద్ధానికి వెళతాడు. సవతితల్లి అతడిని అంతఃపురానికి పిలిచి, మదనోన్మాదంతో అతడిని కౌగిలించుకోవడానికి ప్రయత్నిస్తుంది. పద్మకుమారుడు నిరాకరించడంతో, కోపంతో అతడిని బెదిరిస్తుంది. రాజు తిరిగి వచ్చిన తర్వాత, సవతితల్లి పద్మకుమారుడిపై తనను మోహించి, చెరచాడని అబద్ధపు నిందమోపి, ఏడుస్తుంది. రాజు కోపంతో పద్మకుమారుడిని కొండపై నుండి తోసివేయమని శిక్ష విధిస్తాడు. భటులు అతడిని తోసివేయగా, నాగులు అతడిని రక్షిస్తారు.

పద్మకుమారుడు ఒక సంవత్సరం అక్కడ గడిపి, ఆ తర్వాత హిమాద్రికి వెళ్లి మునివృత్తిని స్వీకరిస్తాడు. తండ్రి దుఃఖంతో అతడిని వెతుక్కుంటూ వచ్చి, తన తప్పును ఒప్పుకొని, రాజ్యమేలుకోమని బ్రతిమాలుతాడు. అయితే, పద్మకుమారుడు రాజ్యభారాన్ని తిరిగి మోయడానికి ఇష్టపడడు. శాంత మనస్కుడైన తనకు సంసారసుఖాలు అవసరం లేదని, హిమపర్వత అడవులే సుఖాన్నిస్తాయని చెబుతాడు. ఎంత బ్రతిమాలిన తనతో రాకపోవడంతో తండ్రి తిరిగి వెళ్లి, తన భార్యకు పద్మకుమారుడికి విధించిన శిక్షనే విధిస్తాడు. ఈ కథ విన్న ప్రజలు "బుద్ధుడే శరణం" అని అంటారు.

**బౌద్ధ తత్వ విశ్లేషణ**:

**త్యాగం-నివారణ**: పద్మకుమారుడు రాజ్యభోగాలను, సంసార సుఖాలను త్యజించి మునివృత్తిని స్వీకరించడం బుద్ధుని రాజ్యత్యాగాన్ని, నిర్వాణంవైపు పయనాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది బౌద్ధమతంలో కోరికలను విడిచిపెట్టడం ద్వారా దుఃఖం నుండి విముక్తి పొందవచ్చనే సూత్రాన్ని నొక్కి చెబుతుంది.

**అహింస-కరుణ**: పద్మకుమారుడు తనపై నింద మోపిన సవతి తల్లి పట్ల ద్వేషం పెంచుకోక పోవడం, రాజు తనను శిక్షించినా శాంతంగా ఉండటం, అహింస, కరుణ అనే బౌద్ధతత్వ సూత్రాలను సూచిస్తుంది.

**దుఃఖం-నివారణ**: పద్మకుమారుడు రాజ్యభారాన్ని "నెత్తిపై బరువు"గా భావించి తొలగించుకోవడం. దాంతో సౌఖ్యాన్ని పొంది, దుఃఖం నుండి విముక్తి పొందడమనే బౌద్ధభావనను దృష్టాంతీకరిస్తుంది.

**ఛదంత జాతకం**:

ఛదంతజాతక సారాంశం బుద్ధుని పూర్వజన్మలలో ఒకటైన ఛదంత ఏనుగులరాజు కథను వివరిస్తుంది. హిమగిరి పర్వతప్రాంతంలో ఒక సరస్సువద్ద ఛదంత అనే తెల్ల ఏనుగురాజు, ఎనిమిదివేల ఏనుగులగుంపుకు నాయకుడు. అతడికి మహాసుభద్ర, శూలసుభద్ర అనే ఇద్దరు రాణులు. ఒకసారి ఛదంత ఏనుగు ఒక సాలవృక్షాన్ని కదిలించగా, మహాసుభద్రపై పూలు, పుప్పొడి పడగా శూలసుభద్రపై ఎండుటాకులు, పురుగులు, దుమ్ము పడతాయి. దీనితో శూలసుభద్ర అవమానంగా భావించి, ఛదంతపై కోపం పెంచుకొని, అతడిని విడిచిపెట్టి వెళ్లి చనిపోతుంది.

ఆమె మరణానంతరం మగధ రాజపుత్రిగా జన్మించి, తర్వాత వారణాసి రాజుకు పట్టపురాణి అవుతుంది. పూర్వజన్మలో జరిగిన అవమానాన్ని గుర్తుంచుకొని, ఛదంతదంతాలను తెప్పించుకోవాలని రాజును కోరుతుంది. రాజు వేటగాళ్లను పిలిచి, సోనుత్తరుడు అనే క్రూరుడైన వేటగాడికి ఈ పనిని అప్పగిస్తాడు. సోనుత్తరుడు ఏడు సంవత్సరాలు, ఏడు నెలలు, ఏడు రోజులు ప్రయాణించి ఛదంత నివాసాన్ని కనుగొంటాడు. అతడు ఒక గుంట తవ్వి, విషపు బాణంతో ఛదంతను కొడతాడు. ఛదంత కోపంతో అతడిపైకి దూకబోయి, సోనుత్తరుడు సన్యాసి వస్త్రాలలో ఉండటం చూసి వెనక్కి తగ్గుతుంది. ఛదంత ధార్మికతకు ప్రభావితుడైన సోనుత్తరుడు తన కథను వివరిస్తాడు. వేటగాడు దంతాలను కోయడానికి బలంగా లేకపోవడంతో, ఛదంత స్వయంగా తన దంతాలను కోసి అతడికి ఇస్తుంది. ఛదంత దంతాలను చూసి వారణాసి రాణి శూలసుభద్ర తట్టుకోలేక స్పృహ తప్పి మరణిస్తుంది.

**బౌద్ధ తత్వ విశ్లేషణ**:

**తృష్ణ, ఈర్ష్య, దుఃఖం** శూలసుభద్రకు కలిగిన ఈర్ష్య, కోపం ఆమె దుఃఖానికి, చివరికి మరణానికి కారణమయ్యాయి. కోరిక దుఃఖానికి మూలకారణం అనే బౌద్ధ సూత్రాన్ని స్పష్టం చేస్తుంది.

**కరుణ మరియు అహింస**: ఛదంత ఏనుగు తనను గాయపరిచిన వేటగాడిపట్ల కూడా కోపం చూపకుండా, సన్యాసివస్త్రాలను చూసి అతడిని క్షమించడం, స్వయంగా తన దంతాలను కోసి ఇవ్వడం బౌద్ధమతంలోని కరుణ, అహింసా సూత్రాలకు గొప్ప ఉదాహరణ. ఇది బోధిసత్త్వ ఆదర్శాన్ని ప్రతిబింబిస్తుంది, ఇతరుల ప్రయోజనం కోసం స్వయంత్యాగం చేయడం.

ఈ జాతక కథలు, దాశరథి పద్యాలలో వ్యక్తమైన బౌద్ధతత్వ సూత్రాలను, ముఖ్యంగా అహింస, కరుణ, త్యాగం, తృష్ణ నివారణ, దుఃఖం నుండి విముక్తి వంటి వాటిని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి.

**ముగింపు**:

దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'మహాబోధి' కావ్యం తెలుగుసాహిత్య రచనే కాదు. బౌద్ధ తత్వశాస్త్రంలోని లోతైన సూత్రాలను తెలుగు ప్రజలకు అందించే మేధోపరమైన ప్రయత్నం. బుద్ధునిజీవితం, బోధనలు, ఆయన స్థాపించిన అహింసా, కరుణ, జ్ఞానోదయం, దుఃఖ నివారణ సూత్రాలను స్పష్టంగా ఎరుకపరుస్తాయి.

ఆంధ్ర మరియు తెలంగాణ ప్రాంతాలలో బౌద్ధమత సుసంపన్నమైన చారిత్రకఉనికి (అమరావతి, నాగార్జునకొండ, నేలకొండపల్లి, ఫణిగిరి, శ్రీశైలం, పల్నాడు వంటి ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలు, విద్యా కేంద్రాలు) దాశరథి మహాబోధి రచనకు ఒక బలమైన నేపథ్యాన్ని అందించింది. సుసంపన్నమైన వారసత్వాన్ని గుర్తించి, తన కవిత్వంలోకి తీసుకువచ్చారు. అశోకుడు, కనిష్కుడు ,ఇక్ష్వాకురాజుల ఏలుబడిలో బౌద్ధమతానికి అందించిన పోషణను ప్రస్తావించడం బౌద్ధమత చారిత్రక ప్రాముఖ్యతను దాశరథి నొక్కి చెప్పారని చెప్పవచ్చు.

మహాపద్మ జాతకం, చాంపేయ జాతకం మరియు ఛదంత జాతకం వంటి కథలను ఉదాహరణలుగా తీసుకొని, బౌద్ధసూత్రాలను మరింత సులభంగా అర్థమయ్యేలా చేశారు. ఈ కథలు త్యాగం, అహింస, కరుణ, ఈర్ష్య వల్ల కలిగే దుఃఖం, దుఃఖనివారణ వంటి బౌద్ధతత్వ భావనలను వ్యక్తీకరిస్తాయి. మొత్తంమీద దాశరథి 'మహాబోధి' కావ్యం బౌద్ధతత్వశాస్త్రంపై సమగ్ర విశ్లేషణ. ఇది కేవలం ఆధ్యాత్మిక అంశాలకే పరిమితం కాకుండా, సామాజిక న్యాయం, సమతావాదం, మరియు విశ్వశాంతి వంటి అంశాలను కూడా తెలియజేసింది. దాశరథి కృష్ణమాచార్యుల మేధోపరమైన లోతును, ఆయన కవిత్వంలో బౌద్ధతత్వభావనల సూక్ష్మమైన ఏకీకరణను, మరియు సామాజిక విముక్తి కోసం ఆయనకున్న నిబద్ధతను స్పష్టంగా వెల్లడిస్తుందని చెప్పవచ్చు.

**ఆధారగ్రంథాలు**:

అంబేద్కర్ బి.ఆర్ : బుద్ధ అండ్ ధర్మ, తెలుగువిశ్వవిద్యాలయం, హైదరాబాదు
కృష్ణమాచార్యులు, దాశరథి : మహాబోధి, తెలంగాణా రచయితల సంఘం, హైదరాబాదు
రంగారావు, మాది రాజు : దాశరథి కవితా సమాలోచనం
రాహుల్ సాంక్రత్యాయన్ : బౌద్ధ దర్శనం

**Copyright & License:**

© Authors retain the copyright of this article. This work is published under the Creative Commons Attribution 4.0 International License (CC BY 4.0), permitting unrestricted use, distribution, and reproduction in any medium, provided the original work is properly cited.